# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 195. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ ఆదివారం.20.04.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## సుప్రీంకోర్టుపై బీజేపీ దాడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19:అమృత్ తెలంగాణ: సుప్రీంకోర్టు పరిమితులను ప్రశ్నిస్తూ బీజేపీ నేతలు మాటలదాడికి దిగుతున్నారు. మొన్న..ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా, తాజాగా బీజేపీ సీనియర్ నాయకుడు సర్వోన్నత న్యాయస్థానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ఈ విధంగా వ్యవహరిస్తూ పోతుంటే ఇక పార్లమెంట్‌ను మూసివేయడం మంచిదంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే శుక్రవారం వ్యాఖ్యానించారు. 'సుప్రీంకోర్టే చట్టాలు చేస్తే పార్లమెంట్‌ను మూసివేయాలి' అని ఎక్స్ వేదికగా దూబే ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని దూబే ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. వక్ఫ్ చట్టంలోని అనేక అంశాలపై సుప్రీంకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో తదుపరి విచారణ వరకు చట్టంలోని వివాదాస్పద నిబంధనలను అమలు చేయకూడదని కేంద్రం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రాత చెరిపి.. రోత పని!

అమృత్ తెలంగాణ: 'కేసీఆర్ ఆనవాళ్లను లేకుండ చేస్తం' అని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు ఇదిగో ఇక్కడ బీఆర్ఎస్ వాల్ రైటింగ్‌లను చెరిపే పనిలో పడ్డరు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలన్న పిలుపుతో బీఆర్ఎస్ ఊరూరా వాల్‌రైటింగ్ చేయిస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ సమీపంలో హైవే పక్కన కల్వర్టుకు బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ రైటింగ్‌ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పేరిట రాయించగా కాంగ్రెస్ నాయకులు దానిపై వైట్ పెయింట్ వేయించారు పైగా ఉచిత బస్సు పథకం ప్రచార రాతలు రాసి తమ అక్కసు వెళ్లగక్కారు. అటుగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర దాన్ని చూసి కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. తమ సహనాన్ని పరీక్షించొద్దని ఆగ్రహం వ్యక్తంచేశారు. - జయశంకర్ భూపాలపల్లి

# భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

## చట్టం అవగాహన సదస్సులో మంత్రి సీతక్క.







కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారులు బొడ్డు లావణ్య గంగాధర్ దంపతుల ఇంట్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి శనివారం రాత్రి భోజనం చేసిన మంత్రి సీతక్క.



ఖానాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ తో కలిసి ప్రారంభించిన మంత్రి సీతక్క... తదనంతరం భూభారతి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ, రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తెచ్చిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క అన్నారు. భూభారతి (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025 పై శనివారం రాత్రి ఖానాపూర్ ఎం పి డి ఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక ఎం ఎల్ ఏ బొజ్జు పటేల్ కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న ప్రజల భూ సమస్యలను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవ్వడమే కాకుండా భవిష్యత్తులో భూ సమస్యలు, భూ వివాదాలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ప్రజల ప్రయోజనార్థం ప్రభుత్వం ఎన్నో రోజులు కసరత్తులు చేసి, రిటైర్డ్ ఉద్యోగులు రెవెన్యూ ఉద్యోగులు న్యాయ నిపుణుల అంశాలు పరిగణలోకి తీసుకొని, ఎన్నో సంప్రదింపుల తర్వాత ఈ భూభారతి చట్టం రూపు దాల్చిందన్నారు. గ్రామీణ స్థాయిలో భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూభారతి చట్టం ద్వారా సాదా బైనామా ప్రక్రియ తిరిగి వాడుకలోకి రానుంది అన్నారు. భూభారతి చట్టం కింద భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్న భూ యజమానుల పట్టాదార్ పాసు పుస్తకాలలో వారి భూమికి సంబంధించిన వివరాలు మ్యాపుల రూపంలో పొందుపరచబడతాయన్నారు. ఈ పద్ధతితో భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయబడతాయన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే వాటిని తొలగించి, భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకుహౌభూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందని సూచించారు. ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో వాటిని నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అయితే, రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందించవచ్చని సూచించారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీఓకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే సత్వరం పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. భూభారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని కోణాలలో, మేధోమథనం చేసిన మీదట సమగ్ర అంశాలను పొందుపరుస్తూ భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. భూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కొప్పుల.. ఒక ప్రస్థానం



కరీంనగర్, ఏప్రిల్ 19 అమృత్ తెలంగాణ: నిరుపేద కుటుంబంలో పుట్టి కార్మికుడిగా మొదలైన కొప్పుల ఈశ్వర్ రాజకీయ ప్రస్థానం రాష్ట్ర మంత్రి వరకు కొనసాగింది. నిరాడంబరత, నిండైన వ్యక్తిత్వం మూర్తీభవించిన కొప్పుల 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని 'ఒక ప్రస్థానం' పేరుతో పెద్దపల్లికి చెందిన ప్రముఖ రచయిత నూతి మల్లన్న ఒక పుస్తకాన్ని రచించారు. ఆదివారం కొప్పుల ఈశ్వర్ 67వ జన్మదినం సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో దీనిని ఆవిష్కరిస్తున్నారు. ఇదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అధ్యక్షతన పుస్తక పరిచయ సభ కూడా నిర్వహిస్తుండగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొంటున్నారు.

నిరుపేద కుటుంబంలో పుట్టి..

నిరుపేద ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొప్పుల లింగయ్య, మల్లమ్మకు జన్మించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనేక కష్టాల నుంచి తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. హమాలీగా, బొగ్గు గనుల్లో కూలీగా, చివరికి సింగరేణిలో కార్మికుడిగా చేరి గోదావరిఖనిలో స్థిరపడ్డారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయాలపై ఆయన క్రమంగా విప్లవ కార్మికోద్యమం వైపు మళ్లారు. సీపీఐ ఎంఎల్ అనుబంధంగా ఏర్పాటు చేసిన గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం వ్యవస్థాపక సభ్యుల్లో ఈశ్వర్ ఒకరు. అనేక కేసులు పెట్టినా కార్మిక వర్గ పోరాటాలను మరింత ఉధృతంగా నిర్వహించే వారు. సీపీఐ ఎంఎల్ పార్టీకి అత్యంత సన్నిహితుడైన నిజామాబాద్ జిల్లా రాయకూరుకు చెందిన ఎలవర్తి సుబ్బారావు చిన్న కూతురు కోకిలతో 1982 జూలై 15న వివాహం జరగగా, ఆమె తన పేరును ప్రముఖ విప్లవకారిని స్నేహలతగా మార్చుకున్నారు.

విప్లవోద్యమంలో వీరిరువురు కలిసి పని చేసేవారు. 1984లోటీడీపీలో చేరగా, క్రమంగా ఎదుగుతూ 1994లో మేడారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్టీ టికెట్ పొందారు. ఆ ఎన్నికల్లో ఓడిపోగా.. అటు ఉద్యోగం కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. అయినా, రాజకీయాల్లో స్థిరంగా నిలబడ్డారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన టీఆర్ఎస్‌లో చేరి, 2004 ఎన్నికల్లో గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన కారణంగా మేడారం వదిలి ధర్మపురి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2014లో ఈశ్వర్ సేవలను గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వ చీఫ్ విప్‌గా నియమించారు. 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ శాఖ మంత్రిగా కొప్పులకు అవకాశం వచ్చింది. కోట్లాది నిధులు తెచ్చి ధర్మపురి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు.

# ఊరూరా కదలిరావాలి



చొప్పదండి/ గంగాధర, ఏప్రిల్ 19:అమృత్ తెలంగాణ: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఊరూరా కదలిరావాలని, కనీవినీ ఎరుగని రీతిలో జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం చొప్పదండి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో, గంగాధర మండలం బూరుగుపల్లిలో ముఖ్యకార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహించగా, సుంకె ముఖ్య అతిథిగా హాజరై ఆయాచోట్ల మాట్లాడారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా చొప్పదండి నియోజకవర్గం కార్యకర్తలు ముందుంటారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎలా కొట్లాడామో, అలాగే ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న పాలనపై ప్రజల పక్షాన నిలబడి ముందుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో ఇచ్చిన లక్ష్యం మేరకు జనాన్ని సభకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల ఉద్యమ గుర్తులు, తెలంగాణ అభివృద్ధిని గుర్తు చేసుకుంటూ నిర్వహిస్తున్న రజతోత్సవ సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చొప్పదండి సమావేశంలో మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు లోక రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, మాజీ జడ్పీటీసీలు ఇప్పనపల్లి సాంబయ్య, మాచర్ల సౌజన్య-వినయ్ కుమార్, మాజీ సర్పంచులు వెల్మ నాగిరెడ్డి, గన్ను శ్రీనివాసరెడ్డి, యువజన సంఘాల సమితి అధ్యక్షులు బంధారపు అజయ్ కుమార్, నాయకులు ఉన్నారు. బూరుగుపల్లి మీటింగ్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు కంకణాల విజేందర్‌రెడ్డి, వేముల దామోదర్, మడ్లపెల్లి గంగాధర్, యండీ నజీర్, రామిడి సురేందర్ పాల్గొన్నారు.

# ల్యాండ్ పూలింగ్‌పై పీచేముడ్!

హైదరాబాద్, ఏప్రిల్ 19 అమృత్ తెలంగాణ: భూములను భారీగా సమీకరిద్దాం%ౌ% మౌలిక వసతులు కల్పిద్దాం. ఇక వాటిని లే అవుట్లుగా అభివృద్ధి చేసి సొమ్ము చేసుకుందామనే మార్కెటింగ్ స్ట్రాటజీతో హెచ్‌ఎండీఏ రూపొందించిన వ్యూహం బెడిసికొట్టింది. భూములు ఇచ్చే వారు లేకపోవడంతో ల్యాండ్ పూలింగ్ స్కీం నీరుగారిపోతున్నది. వాటా విషయంలోనే రైతులు, హెచ్‌ఎండీఏ మధ్య సయోధ్య లేకపోకుండాపోయింది. దీంతో గ్రామ సభల్లోనే రైతులు భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పేశారు.

ఖజానా నింపుకొనేందుకు..

ఖజానా నింపుకొనేందుకు హెచ్‌ఎండీఏ ల్యాండ్ పూలింగ్ పథకానికి తెరలేపింది. మోకీల మండలం, శంకర్‌పల్లి గ్రామంలో దాదాపు 456 ఎకరాలు, ఘట్ కేసర్ మండల పరిధిలోని ప్రతాప సింగారం, కొర్రెముల్లా గ్రామాల పరిధిలో మరో 1000 ఎకరాల భూములను సేకరించేలా ప్రణాళికలను రచించింది. రైతుల నుంచి నిరభ్యంతర పత్రాలను కూడా స్వీకరించింది. ఇప్పుడు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులే అభ్యంతరం వ్యక్తం చేస్తుండటంతో ల్యాండ్ పూలింగ్ సందిగ్ధంలో పడింది.

ముందుకు రాని రైతులు

భూముల ధరలు విపరీతంగా పెరగడం, కమర్షియల్ యాక్టివిటీ విస్తరించడంతోనే హెచ్‌ఎండీఏ ఇచ్చే పరిహారం తక్కువగా ఉందని రైతులు భావిస్తున్నారు. అభివృద్ధి చేసిన 70 శాతం భూమిని తమకే ఇవ్వాలని, ప్రతాపసింగారంలో గ్రామసభలో రైతులు అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మార్కెట్ ధరతో పోల్చితే తక్కువ ఉందని చాలా మంది రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ ఇచ్చే నిష్పత్తి 60: 40 ఉంటుందని, దీంతోపాటు పూర్తి స్థాయిలో డెవలప్ చేసిన ప్లాట్లు అందుబాటులోకి వస్తాయని భూములకు మరింత డిమాండ్ పెరుగుతుందని వివరించారు. సర్కారు 60 శాతానికి మించి ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతులు ముందుకు రావడం లేదు.




# అగ్నిమాపకశాఖకు అత్యాధునిక సామగ్రి




హైదరాబాద్, ఏప్రిల్ 19 అమృత్ తెలంగాణ: తెలంగాణ అగ్నిమాపకశాఖకు ఏ రాష్ట్రంలో లేనట్టుగా అత్యాధునిక సామగ్రిని సమకూర్చామని రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రవిగుప్తా అన్నారు. అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా శనివారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నూతన అగ్నిమాపక వాహనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అగ్నిమాపకశాఖ దక్షిణాదిలోనే తొలిసారిగా రోబోలను సమకూర్చుకున్నదని తెలిపారు. ప్రజలు, మూగజీవాల ప్రాణాలు కాపాడటంతోపాటు, ప్రజా ఆస్తులను రక్షించేందుకు నూతనంగా కొనుగోలు చేసిన యంత్ర సామగ్రి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాల నివారణ సమష్టి బాధ్యత అని చెప్పారు. ఫైర్ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతివారం అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. నిరుడు సుమారుకి 8,500కి పైగా ఫైర్‌కాల్స్ వచ్చాయని, ప్రమాదాలను నివారించేందుకు నీటిడ్రమ్ములను అందుబాటులో ఉండేలా భవన యజమానులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫైర్‌వీక్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరుగుతుందని ఆ రోజున 5కే రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జీవీ నారాయణరావు, అడిషనల్ ప్రసన్నకుమార్, డిప్యూటీ డైరెక్టర్ బీ సుధాకర్‌రావు, డీఎఫ్‌వోలు, ఏడీఎఫ్‌వోలు సిబ్బంది పాల్గొన్నారు.

# బెయిల్ తిరస్కరణపై కొత్త భాష్యం వద్దు

న్యూఢిల్లీ: అమృత్ తెలంగాణ: శిక్షా కాలంలో సగం పూర్తయిన తర్వాతనే బెయిల్ దరఖాస్తు విజ్ఞప్తిని అంగీకరిస్తామంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇవ్వడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు చట్టానికి కొత్త భాష్యం చెప్పవద్దంటూ మొట్టికాయలు వేసింది. తన శిక్షను సవాల్ చేస్తూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై అధిక పెండింగ్ కేసుల కారణంగా సమీప భవిష్యత్తులో విచారించే అవకాశం లేనప్పుడు అతనికి తప్పక బెయిల్ మంజూరు చేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు ఓ కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు ఎలాంటి ఆధారం లేని కొత్త ప్రతిపాదన కనిపెట్టడం ఆశ్చర్యానికి గురి చేసిందని గురువారం వ్యాఖ్యానించింది. చట్టాన్ని హైకోర్టు యథాతథంగా అమలు చేయాలని, బెయిల్ కోసం ముందుకు వెళ్లాలని పిటిషనర్‌ను బలవంతం చేయకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడు రెండోసారి బెయిల్ కోసం అభ్యర్థించినప్పుడు 'జైలు శిక్షలో సగం అనుభవించిన తర్వాత మాత్రమే నిందితుడు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఈ న్యాయస్థానం స్పష్టం చేస్తున్నది' అని హైకోర్టు పేర్కొనడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పు పట్టింది.

# యాసంగి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.






అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : శనివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్ సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తిచేసిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరిట రైతులకు ఎటువంటి కోతలు పెట్టవద్దని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని అన్నారు. వానాకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు అధికారులందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన వివరాలను మంత్రికి కలెక్టర్ తెలియజేశారు. నిర్ణీత సమయానికి జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా వరి కొనుగోలును నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ మంచిర్యాల జిల్లా కుమార్ దీపక్, సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జొన్న రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



తాంసి, ఏప్రిల్ 18 :అమృత్ తెలంగాణ: ఎకరానికి 15 క్వింటాళ్ల చొప్పున జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. తాంసి మండల కేంద్రంలో మార్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలను మోసం చేసి గద్దెనెకి హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సురకుంటి మంజుల శ్రీధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, సీఈవో కేశవ్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, నాయకులు మహేందర్, రజినీకాంత్ రెడ్డి, లక్ష్మీపతి, వినోద్ రెడ్డి, సంతోష్, గడుగు గంగన్న, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో నీరులేక..చేపలు మృత్యువాత



పెంబి, ఏప్రిల్ 18:అమృత్ తెలంగాణ: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని మందపల్లి గ్రామంలోని కొత్త చెరువులో నీరు అడుగంటిపోవడంతో రూ.50 వేల విలువైన చేపలు చనిపోవడంతో శుక్రవారం మత్స్యకారులు నిరసన తెలిపారు. మందపల్లి గ్రామంలోని కొత్త చెరువులో చేపల పెంపకంతో మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. సాగునీరు అందించేందుకు ప్రతి యేటా ఎస్సారెస్పీ డీ-28 కాలువ ద్వారా ఈ చెరువుకు నీటిని విడుదల చేస్తున్నారు.. గత కొన్ని రోజుల నుంచి విడుదల చేయపోవడంతో చెరువు నీరు అడుగంటిపోయింది. ఉన్న కొద్ది నీటిని కూడా పంటలు ఎండిపోకుండా ఆయకట్టు రైతులు చెరువులో మోటార్లు బిగించి వాడుకున్నారు. ప్రస్తుతం చెరువు పూర్తిగా ఎండిపోవడంతో చేపలు పెద్ద సంఖ్యలో చనిపోయాయి. దీంతో చనిపోయిన చేపలను చూపిస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. సుమారు రూ.50 వేలు నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మిగిలిన చేపలను చనిపోకుండా వెంటనే చెరువుకు నీటిని విడుదల చేయాలని, చెరువులో మోటర్లు బిగించకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు దేశవేణి రాజన్న, కల్లెడ పెద్దులు, భీమన్న, పోశెట్టి, రమేశ్ తదితరులు కోరారు.

# భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'



హాలియా/హాలియా/తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 19 : అమృత్ తెలంగాణ: భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. భూ భారతి చట్టంపై శనివారం అనుముల మం డలం కొత్తపల్లి గ్రామంలోని రైతు వేదికలో, పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన మాట్లాడారు. ఈ చట్టం ద్వారా అని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి ద్వారా 30 రోజుల్లో మ్యుటేషన్ చేయకపొతే 31వ రోజు ఆటోమెటిక్‌గా మ్యుటేషన్ అవుతుందన్నారు. బహుళ ప్రయోజనాలున్న ఈ చట్టం జూన్ 2 నుంచి రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని తెలిపారు.

# 'సప్తగిరి' దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దు




జమ్మికుంట, ఏప్రిల్ 19 :అమృత్ తెలంగాణ: సీఎంఆర్ఎఫ్ స్కాంకు పాల్పడిన కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి ప్రైవేట్ దవాఖాన రిజిస్ట్రేషన్ రద్దైంది. సదరు దవాఖానకు చెందిన వైద్యులు, రోగులకు చికిత్స చేయకపోయినా.. చేసినట్లు నకిలీ బిల్లులు సృష్టించి సీఎంఆర్ఎఫ్ నుంచి నిధులు స్వాహా చేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో సీఐడీ అధికారులు 2022-23లో కేసు నమోదు చేశారు. పలుసార్లు విచారణ చేసిన సంగతి తెలిసిందే. విచారణలో స్కాం నిజమేనని నిర్ధారణకు వచ్చారు. దీంతో జమ్మికుంట పట్టణంలోని సప్తగిరి దవాఖాన రిజిస్ట్రేషన్‌ను (అనుమతులు)ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఈ మేరకు మూడు రోజుల క్రితమే దవాఖాన నిర్వాహకులకు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ నుంచి గుర్తింపు రద్దు చేస్తూ నోటీసులు జారీ అయ్యాయి. అయితే, నోటీసులు అందుకున్నప్పటికీ సదరు దవాఖాన నిర్వాహకులు దవాఖానను నడిపిస్తున్నారే సమాచారం మేరకు ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వో సూచనల మేరకు హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సప్తగిరి దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి, పరిశీలించారు. ఈ సమయంలో వైద్యులు, నిర్వాహకులు ఎవరూ అందుబాటులో లేరు. వార్డులు, చికిత్స, తదితర గదులను చూశారు. రికార్డులు పరిశీలించారు. కాగా, 'సప్తగిరి' అనుమతులు రద్దు, సీజ్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వోను వివరణ కోరగా.. సీఎంఆర్ఎఫ్ నిధుల స్వాహా జరిగింది నిజమేనని నిర్ధారణకు వచ్చామని, సప్తగిరి అనుమతులు కూడా డీఆర్ఏ నుంచి రద్దు చేస్తున్నట్లు నోటీసులు కూడా జారీ చేశామని చెప్పారు. దవాఖాన నిర్వాహకులకు నోటీసులు అందాయన్నారు. త్వరలో సీజ్ కూడా చేస్తామని చెప్పుకొచ్చారు. దవాఖాన నడిపించినైట్లైతే కఠిన చర్య లు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో సిబ్బంది ప్రతాప్, నరేందర్, రాజు ఉన్నారు.

# ఎకరాకు రూ.25 వేలు అందించాలి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 19 :అమృత్ తెలంగాణ: వడగండ్ల వాన, ఈదురుగాలులతో పంట నష్టపోయి న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.25వేలు అందించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల డిమాండ్ చేశారు. శనివారం జగిత్యాల జి ల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి, కో జన్ కొత్తూర్, కేశాపూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలం ముత్యంపేటలో పర్యటించారు. శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వాన, ఈదురు గాలులతో దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఎర్దండిలోని వొడ్డెర కాలనీ లో వడగళ్ల వాన, ఈదురు గాలులతో గుడిసెలు దెబ్బతిన్న బాధిత కుటుంబాలను ప రామర్శించి, 27 మందికి రూ.3 వేల చొ ప్పున రూ.81 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో వడగళ్ల వానతో పంటలు తీవ్రం గా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం నష్టపోయి న రైతులకు ఎకరాన రూ.25వేలు అందించాలన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావుకు ఫోన్‌చేసి, కోరుట్ల నియోజకవర్గంలో పంట న ష్టాన్ని వివరించారు. అలాగే పంట నష్ట వివరాలను సర్వేచేసి ఉన్నతాధికారులకు పం పించాలని ఏవోకు సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వడగళ్ల వానతో నష్టపో యిన రైతులకు నష్టపరిహారం అందించి ఆ దుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక్కడ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఏడీఏ రమేశ్, తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏడీ మనోహర్, ఏఈ భూమేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు బద్దం గోపి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు దశరథ్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నేమూరి సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# గత పాలకుల తప్పిదాల మూలంగా అభివృద్ధిలో వెనుకబడ్డాం

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి
## ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమీక్షలో ఇన్చార్జి మంత్రి సీతక్కకు సూచించిన ఎమ్మెల్యే
## అధికారుల నిర్లక్ష్య వైఖరి పై మండిపాటు




అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా ఏప్రిల్ 19 గతంలో నియోజకవర్గ అభివృద్ధి కాగితాలకే పరిమితమైందని, పాలకుల నిర్లక్ష్య వైఖరి మూలంగా నిధులు మంజూరైనప్పటికీ, అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆవేదన వెళ్లగక్కారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అధ్యక్షతన ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అభివృద్ధి సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎఫ్ డి ఆర్ ప్యాకేజీలో చింతల్ బోరి టు మహాగాం, కల్లూరు టూ మోత్కుపల్లి, కోతుల్ గావ్ టు వాడి గ్రామాలకు వెళ్లడానికి బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, సంవత్సరాల తరబడి పనులు ప్రారంభం కాలేదన్నారు. పనులను రివైజ్ చేసి నిధులను పెంచి, వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.. కాగితాల్లో ప్రోగ్రెస్ మాత్రమే ఉందని, అభివృద్ధి నత్తనడకన ఉందని అధికారుల వైఖరిని ఎండగట్టారు. జిల్లా అధికారులు సమస్యలను సీరియస్ గా తీసుకోవడం లేదని, ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. అదేవిధంగా నియోజకవర్గంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మారుమూల గ్రామాల్లో, తండాల్లో సమస్య తీవ్రతరంగా ఉందన్నారు. వేసవి ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటికీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడం ఏంటన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పంట పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే పటేల్ సూచించిన అంశం లో సీరియస్ గా దృష్టి సారిస్తామని, పనులను వేగవంతం చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క అన్నారు.

# ఛలో ఇంద్రవెల్లి!! ఛలో రగల్ జెండా!!!

ఇంద్రవెల్లి ఆదివాసీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం......

సెద్మకి. ఆనంద్ రావ్.. ఆదివాసీ జిల్లా కాంగ్రెస్ కమిటీ చైర్మన్

భూమి కోసం, భుక్తి కోసం, ఆదివాసులు అస్తిత్వం కోసం

అమరులైన ఆదివాసీలను స్మరిస్తూ

ప్రజా ప్రభుత్వం అమరులైన ఆదివాసీ అమరవీరుల గౌరవార్థం

ఏప్రిల్ 20వ తేదిని అధికారికంగా నిర్వహించడం

అలాగే స్మృతివనం ఏర్పాటు చేయడం చాలా శుభ సూచకం...

సేద్మకి.ఆనంద్ రావ్.. జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్

ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలను

ప్రగతిపథంలో నడిపించడం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య ఉద్దేశ్యం

నాడు ఇంద్రవెల్లి అమరవీరుల

సాక్షిగా దళిత గిరిజన దండోరా

మ్రోగించి ఇందిరమ్మ సంక్షేమ రాజ్యానికి శ్రీకారం చుట్టారు

గతంలో ఇంద్రవెల్లి అమరులకు

నివాళులు అర్పించాలి అంటే ఎన్నో నిషేధజ్ఞల నడుమ నివాళులు అరిపించడం జరిగింది కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన వెంటనే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో

జిల్లా ఇంచార్జ్ మంత్రి సీతక్క గారి చొరవతో



కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి

స్మృతివనంను సుందరికరణ చేయడం జరిగింది

అలాగే అధికారికంగా అమరవీరులకు నివాళులు అర్పించడం జరిగింది

ఇంద్రవెల్లి అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి లిరేవంత్ రెడ్డి గారికి

జిల్లా ఇంచార్జ్ మంత్రి

సీతక్కంకు ఆదిలాబాద్ జిల్లా ఆదివాసుల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరుగుతుంది

కావున రేపు అధికారికంగా నిర్వహిస్తున్న అమర వీరుల సంస్మరణ సభను ఉమ్మడి జిల్లా ఆదివాసులు పెద్ద ఎత్తున పాల్గోని

భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి అని

సేద్మకి.ఆనంద్ రావ్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ పేర్కొన్నారు

# అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి మంత్రి సీతక్క చేతుల మీదుగా జోన్నల కేంద్రం ప్రారంభం

అమృత్ తెలంగాణ: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపి గెడం నగేష్, ఎమ్మెల్సీ దండే విట్టల్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజరెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు ప్రస్తుత నిబంధనల ప్రకారం ఎకరాకి ఒక్కో రైతు నుంచి 8.65 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉండగా, రైతుల మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల విజ్ఞప్తి మేరకు ఆ పరిమితిని ఎకరాంకు 14 క్వింటాళ్లకు ప్రజాప్రభుత్వం పెంచడం జరిగింది అని, ఆదిలాబాదు లో ఎక్కువగా జోన్న సాగు చేస్తున్న రైతులకు ప్రజాప్రభుత్వం అండగా నిలుస్తుంది అని ఎవరు అధైర్య పడద్దు అని మంత్రి సీతక్క చెప్పారు. రైతుల కొనుగోళ్లలో అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అధికారులను



ఆదేశించారు.అలాగే పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మరియు ఇచ్చోడ లోని జిల్లా పరిషత్ పాఠశాల లలో దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిల్స్ పంపిణి చేసారు. దనోరా బి లో వంతెన పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు వేణుగోపాలచారి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్, బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, తలమడుగు మాజీ జడ్పి టిసి గోక గణేష్ రెడ్డి, మల్లెపూల నర్సయ్య, పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, నారాయణ రెడ్డి, ఆడే వసంత్ రావ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, సీనియర్ నాయకులు నలిమేల నవీన్ రెడ్డి, ఫెరోజ్, సముల్లాఖాన్, అఫ్సర్, రహీం ఖాన్, వాసిం రంజాని తదితరులు పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల్లో సింగరేణి విస్తరణ విజయవంతం.. సింగరేణి చైర్మన్ ఎం బలరాం వెల్లడి



గోదావరిఖని :అమృత్ తెలంగాణ: సింగరేణి ఇతర రాష్ట్రాల విస్తరణలో తొలి అడుగుగా ఒడిశా రాష్ట్రంలో నైనీ బొగ్గు గనిని విజయవంతంగా ప్రారంభించడం జరిగిందని, ఇదే స్ఫూర్తితో ఇతర రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో మరిన్ని గనులు, ఇతర ఖనిజ ఉత్పత్తులను చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. నైనీ బొగ్గు గని ప్రారంభంతో సింగరేణి ఎక్కడైనా విస్తరించగలదన్న భరోసా, నమ్మకం అందరిలో కలిగిందన్నారు. నైనీ బొగ్గు బ్లాకును ప్రారంభించిన సందర్భంగా శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సీఎండీ ఎన్.బలరామ్ కు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నైనీ బొగ్గు బ్లాకు సాధన వెనుక సీఎం, డిప్యూటీ సీఎం ప్రత్యేక చొరవతో పాటు, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి, ఒడిశా సీఎం, స్థానిక ఎమ్మెల్యే, వివిధ శాఖల అధికారుల సహకారం ఉందని, తాను ఈ ప్రక్రియలో సమన్వయ బాధ్యతను స్వీకరించడం ఒక అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలంలో అనేక మంది మాజీ సింగరేణి అధికారులు కూడా తమ వంతుగా కృషి చేశారని వారికి అభినందనలు తెలిపారు. సింగరేణి సంస్థ ఇకపై కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ గానే కాకుండా ఇతర ఖనిజాల ఉత్పత్తి సంస్థగా కూడా ఎదగనున్నదని, థర్మల్ విద్యుత్తుతో పాటు, పునరుత్పాదక విద్యుత్తు రంగంలో కూడా విస్తరించనున్నదని తెలిపారు. ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ రాజకుమార్ మాట్లాడుతూ నైనీ సాధనలో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో పాటు చైర్మన్ ఎన్.బలరామ్ ప్రత్యేక కృషి ప్రశంసనీయమని పేర్కొంటూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో సమావేశంలో అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, అధికారుల సంఘం నాయకులు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు, సీ.ఎం.ఓ.ఏ.ఐ ప్రతినిధులు కూడా నైనీ బొగ్గు గనిని సింగరేణి సాధించటం ఒక చారిత్రక ఘట్టమని, దీనిలో చైర్మన్ కృషి ఎంతో ఉందని ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభాని నైనీ బొగ్గు గని నుండి తీసిన తొలి బొగ్గు పెళ్ళతో చైర్మన్ ఉన్న చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించి శాలువతో సన్మానించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి సంస్థ డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు, డెరెక్టర్(ఆపరేషన్స్) ఎల్వి సూర్యనారాయణ రావు, డెరెక్టర్ (పి.పిఅండ్ పా) వెంకటేశ్వర్లు, జి.ఎం. (సీపీపీ) మనోహర్, కార్పొరేట్ విభాగాల అధిపతులు, హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి జీఎం (మార్కెటింగ్) శ్రీ ఎన్.వి.రాజశేఖర్ రావు ఆయా ఏరియాల జీ.ఎం లు పాల్గొన్నారు.

# మంజీరను తోడేస్తున్నారు..



బోధన్, ఏప్రిల్ 18 అమృత్ తెలంగాణ: బోధన్ డివిజన్‌లో కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న ఖండ్‌గావ్ క్వారీ నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. అడ్డూ అదుపులేకుండా మంజీరాలో తవ్వకాలు చేపడుతూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నా రు. వందలాది టిప్పర్లు, లారీల్లో ఇసుకను పరిమితికి మించి నింపు తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. నియోజకవర్గంలో 'పెద్దాయన' సపోర్టు తమకు ఉన్నదనే భావనతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ఇసుక క్వారీలో తవ్వకాలు చేపట్టడం గమనార్హం. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీ ఖండ్‌గావ్ క్వారీలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా చేపట్టారు. ఈ తతంగమంతా క్వారీ పరిశీలనకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ' కంటపడింది. తమ కు ఎదురే లేదన్నట్లుగా మంజీర మధ్య భాగంలో ఇసుక తవ్వకాలు చేపడుతూ కుప్పలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జేసీబీతో తవ్వకాలు చేపడుతుండడం కనిపించింది. నిబంధనల ప్రకారం మంజీరా నదిలోని క్వారీలో ఇసుక తవ్వకాలకు జేసీబీలను వాడరాదు. సెలవు రోజే కదా.. ఎవరు చూస్తారులే అనుకున్నారేమో నిర్వాహకులు. యథేచ్ఛగా జేసీబీతో తవ్వకాలను ప్రారంభించారు. ప్రభుత్వ సెలవు దినాల్లోనూ ఇలాగే జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నట్లు తెలిసింది. సెలవుల అనంతరం ఇసుకను టిప్పర్లు, లారీల్లో లోడ్ చేసి తరలిస్తున్నారు.

వే బిల్లులు లేకున్నా..జోరుగా తవ్వకాలు

నిబంధనల ప్రకారం ప్రభుత్వ సెలవు దినాల్లో రెవెన్యూ అధికారులు ఇసుక వాహనాలకు వే బిల్లులు మంజూరుచేయరు. ఇసుక క్వారీల వద్ద రెవెన్యూ సిబ్బంది కూడా అందుబాటులో ఉండరు. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేని సెలవు దినాల్లో క్వారీ నిర్వాహకులు నదీగర్భంలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదు. కానీ వే బిల్లులు జారీచేసే రోజుల్లో కూడా ఈ క్వారీలో ఇసుక తవ్వకాల్లో నిబంధనలను పాటించడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు, లోడింగ్ చేయడం కూలీల ద్వారా జరగాలి.. ఇది ప్రభుత్వ క్వారీ అయినందున క్వారీ నిర్వహణలో ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీ ఎంతమాత్రం ఉండకూడదు. అయితే, ఇక్కడ మాత్రం ప్రైవేట్ వ్యక్తులు పెత్తనం సాగిస్తున్నట్లు తెలిసింది. అజమాయిషీ చేయాల్సిన రెవెన్యూ సిబ్బంది నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లోతుగా తవ్వకాలు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు

ఖండ్‌గావ్ క్వారీతో పాటు మంజీరా తీరంలోని క్వారీల్లో ఇసుక తవ్వకాల్లో నిబంధనలను తుంగలోకి తొక్కుతున్నారు. ఇసుక పరిమాణం ఆధారంగా ఒకటిన్నర మీటరు నుంచి రెండున్నర మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపట్టాలి. ఎంత లోతువరకు తవ్వకాలు చేపట్టాలో మైనింగ్‌శాఖ నిర్దేశిస్తుంది. కానీ ఖండ్‌క్వారీతో సహా మిగతా క్వారీల్లో ఈ నిబంధనను ఉల్లంఘిస్తున్నారు. ఖండ్‌గావ్ క్వారీలో పరిమితికి మించి ఎక్కువ లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ గుంతలు కనిపించకుండా ఎప్పటికప్పుడు పూడ్చేస్తున్నట్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇలా లోతుగా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో భూగర్భజలాలలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతే కాకుండా టిప్పర్లు, లారీల్లో పరిమితికి మించి ఇసుకను నింపుతున్నారు. ఇలా ఓవర్‌లోడ్ ఇసుక వాహనాలతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతున్నది. ఒక్కో టిప్పర్‌లో 15 టన్నులు (10 క్యూబిక్ మీటర్లు) లోడ్ వేయాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఏకంగా 21 టన్నుల (14 క్యూబిక్ మీటర్లు) ఇసుకను నింపుతున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతున్నప్పటికీ, పోలీస్, రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఈ విషయమై బోధన్ తహసీల్దార్ విఠల్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ అడగగా%ో% నది మధ్యలో జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపడుతామని, ఒకవేళ చేపడితే విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

# ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షెడ్ల నిర్మాణాలు.. కూల్చివేసిన హైడ్రా



మాదాపూర్, ఏప్రిల్ 19:అమృత్ తెలంగాణ: ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వెలసిన నిర్మాణాలపై హైడ్రా కొరడా జులిపించింది. హైదరాబాద్ కొండాపూర్‌లోని వసంత సిటీ సమీపంలో ఉన్న సర్వే నంబర్ 79 లో 39 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని వసంత కృష్ణ ప్రసాద్ తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేసినట్లు హైడ్రా అధికారులు తెలిపారు. తన ముగ్గురు అనుచరుల సాయంతో దాదాపు రూ.2వేల కోట్ల విలువైన స్థలాన్ని కబ్జా చేసి నాలుగు భాగాలుగా విభజించి పలు షెడ్లు, కార్యాలయాలు, గెస్ట్ హౌస్‌లు నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇలా తప్పుడు పత్రాలతో గతంలో అనుమతులు పొంది నిర్మాణాలు చేపట్టడంతో హైడ్రా అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

మూడు నెలల ముందు అందిన ఫిర్యాదు

వసంత కృష్ణ ప్రసాద్ తన అనుచరులతో కలిసి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారు. అయితే ఆ సమయంలో అతనికి సహకరించిన అనుచరులతో ఇటీవల విభేధాలు తలెత్తాయి. దీంతో కృష్ణప్రసాద్‌కు దూరంగా ఉంటున్న వారు.. మూడు నెలల క్రితం హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైడ్రా బృందం తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లుగా నిర్ధారించారు. ఈ క్రమంలోనే శనివారం చర్యలకు దిగారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్లు, కార్యాలయాలు, గెస్ట్ హౌస్‌లు, ప్రహారీ గోడలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. అనంతరం ఆ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లుగా హైడ్రా అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 'సేఫ్ హ్యాండ్స్' చేయూత అభినందనీయం : ఎంఈఓ ప్రభాకర్





మధిర, ఏప్రిల్ 19 :అమృత్ తెలంగాణ: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూత అందించడం అభినందనీయమని మధిర మండల ఎంఈఓ వై.ప్రభాకర్ అన్నారు. సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు పోతుకూచి కళ్యాణ చక్రవర్తి మధిర మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలకు రూ.75 వేల విలువైన షూస్, ఫర్నిచర్ వితరణగా ఇవ్వగా శనివారం ఎంఈఓ పాఠశాలకు, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గడిచిన 10 సంవత్సరాల నుండి సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పాఠశాలకు కావాల్సిన భౌతిక వనరులను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూనే మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు సంవత్సరాల కాలంలో రూ.4 లక్షల విలువైన సామగ్రి అందించిన సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు పోతుకూచి కళ్యాణ చక్రవర్తి, సౌమ్య దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



వీణవంక, ఏప్రిల్ 19 :అమృత్ తెలంగాణ: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన విధంగా అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మండలంలోని వీణవంక , మామిడాలపల్లి, ఇప్పలపల్లి, చల్లూరు, కనపర్తి, రామకృష్ణాపూర్, లస్మక్కపల్లి, బ్రాహ్మణ గ్రామాలలో మహిళ సంఘాల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా మండల కేంద్రంలో ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఇబ్బందులు పెట్టొద్దని, బార్దాన్ అందించి సకాలంలో కొనుగోలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్, సమ్మిరెడ్డి, మల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదాసి సునీల్, శ్రీపతి రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, ఏపీఎం కొమురయ్య, సీసీలు ఆనంద్, ఘన శ్యాం, తిరుపతి, శ్రీకాంత్, వీవోఏలు, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు-ఖమ్మం ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



కారేపల్లి, ఏప్రిల్ 19 :అమృత్ తెలంగాణ: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ పరిధిలోని ఇల్లెందు నుండి వయా కారేపల్లి, కమలాపురం మీదుగా ఖమ్మం వరకు ఆర్టీసీ బస్ సర్వీస్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ముందుగా మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పచ్చజెండాను ఊపి బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. ఉసిరికాయలపల్లి నుండి సూర్యతండా వరకు స్థానిక అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బస్‌లో ప్రయాణించారు. అదేవిధంగా సూర్యతండా ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెరుగుతున్నపెట్టుబడులు.. పరిమితంగా రుణాలు



ఆదిలాబాద్, ఏప్రిల్ 19.అమృత్ తెలంగాణ: సాగులో రైతులకు అండగా నిలవాల్సిన బ్యాంకులు రుణాల మంజూరు, రుణ పరిమితి విషయంలో సరిగా వ్యవహరించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1.47 లక్షల మంది పట్టా పాసు పుస్తకాలు కలిగిన రైతులు ఉన్నారు. వీరు సాగు కోసం బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటారు. వివిధ బ్యాంకులకు చెందిన 25 బ్రాంచ్‌ల ద్వారా రైతులకు వానకాలం, యాసంగిలో రుణాలు ఇస్తారు. ఏటా వ్యవసాయ సీజన్‌కు ముందు రుణాల పంపిణీలో భాగంగా బ్యాంకర్ల సమితి పంటలవారీగా సాగయ్యే ఖర్చులు, ఇతర పెట్టుబడులను అంచనా వేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏ ఏ పంటలకు ఎంత రుణం ఇవ్వాలనేది నిర్ణయిస్తుంది. ఇటీవల బ్యాంకర్ల సమితి సమావేశమై రుణ పరిమితి వివరాలను వెల్లడించింది. గతేడాది పోలిస్తే పంటలవారీగా కొన్నింటికీ మాత్రమే స్వల్పంగా పెంచుతున్నట్లు ప్రకటించారు. రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్ల నిర్ణయంపై రైతు సంఘాలు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన పంట పెట్టుబడులు

ఆదిలాబాద్ జిల్లాలో ఏటా వానకాలంలో రైతు లు 5.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. పెట్టుబడి కోసం బ్యాంకు రుణాలు తీసుకోవడంతోపాటు ప్రైవేటు అప్పులు చేస్తారు. ఏ టా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కూలీల రేట్లు పెరుగుతున్నాయి. దీంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతుంది. బ్యాంకులు ఇచ్చే రుణాలు సరిపోకపోవడంతో రైతులు ప్రైవేటు అ ప్పులు చేసి నష్టపోవాల్సి వస్తుంది. బ్యాంకర్ల సమితి వర్షాధార, నీటి ఆధారంగా చేసే పంటలకు వేర్వేరుగా రుణ పరిమితిని నిర్ణయిస్తారు. జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి, సోయా, కంది, జొన్న, శనగ సాగు చేస్తారు. ఈ ఏడాది ఎకరా పత్తి సాగు కు రూ.2 వేలు పెంచారు. సోయా, జొన్న పంటలకు రుణాలను పెంచలేదు. కందులు శనగ, పెసర పంటలకు స్వల్పంగా పెంచారు. బ్యాంకు పెంచిన రుణాలు సాగుకు సరిపోవని రుణ పరిమితిని ఇంకా పెంచాలని రైతులు కోరుతున్నారు.


పెట్టుబడి బాగా పెరిగింది..

నాకు మూడెకరాల భూమి ఉంది. రామాయి దక్కన్ గ్రామీణ బ్యాంకులో నేను పంట రుణం తీసుకుంటా. పెట్టుబడులు ఏటా పెరుగుతున్న బ్యాంకు రుణాలు మాత్రం పెరగడం లేదు. ఈ సారి పత్తి ప్యాకెట్ ధర రూ.47 పెరిగింది. ఎరువులు, మందుల ధరలు పెరిగాయి. పత్తి ఏరడానికి కూలీలు కిలోకు రూ.10 తీసుకుంటున్నారు. వేరే ఖర్చులు కూడా ఉంటాయి. బ్యాంకులు ఇచ్చే రుణాలు సరిపోవడం లేదు. దీంతో ప్రైవేట్ అప్పులు తీసుకుని ఎక్కువ వడ్డీతో రైతులు నష్టపోతున్నాం. బ్యాంకర్లు రుణ పరిమితి పెంచాలి చుక్కబొట్ల రవి, యాపల్‌గూడ, ఆదిలాబాద్ రూరల్ మండలం

ధరలకు అనుకూలంగా రుణాలు ఇవ్వాలి..

ఏటా సాగు పెట్టుబడులు పెరుగుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాల ధరలు బాగా పెరుగుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీలను ఇవ్వడం లేదు. దీంతో రైతులపై భారం పడుతుంది. ఎరువులు, పురుగుల మందులు, కలుపుతీత కూలీలు, పంట తీసే కూలీల రేట్లు పెరిగాయి. బ్యాంకర్లు వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని రుణపరిమితి నిర్ణయించాలి. కొన్ని పంటలకు గతేడాదితో పోలిస్తే ఎలాంటి మార్పు లేదు. బ్యాంకర్ల నిర్ణయాలు రైతులకు అనుకూలంగా ఉండాలి. – బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

# కష్టకాలంలో ఆదుకుని.. ఆ కుటుంబానికి ఇలవేల్పుగా కేసీఆర్



లింగాల గణపురం:అమృత్ తెలంగాణ: తెలంగాణ ఉద్యమంలో అసువులుబాసిన ఉద్యమకారుని కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు.ఆర్థిక సహాయం చేయడమే కాకుండా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించారు. కష్టకాలంలోఅండగానిలిచిన కేసీఆర్‌ను ఆ కుటుంబం ఇలవేల్పుగా కొలుస్తున్నది. పార్టీ రజతోత్సవ వేడుకల నేపథ్యంలో కేసీఆర్ సేవలకు వారు గుర్తుచేసకున్నారు. లింగాల గణపురం మండలంలోని నవాబుపేటకు చెందిన ముత్తినేని శ్రీనివాస్.కేసీఆర్ పిలుపుతో తెలంగాణఉద్యమంలో పాల్గొన్నారు. పలు ధర్నాలు, దీక్షల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమవుతుండటంతో తీవ్ర కలతకు గురైన శ్రీనివాస్ 2010 జనవరి 13నఒంటిపై కిరోసిన్ చల్లుకొని నిప్పంటించుకున్నారు. సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ చికిత్స పొందుతూ అదే ఏడాది మార్చి 11న మరణించారు.ఆసమయంలో కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాటకు కట్టుబడి ఆ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్ భార్య మంజులకు ఇరిగేషన్ శాఖలో అటెండర్ నౌకరి ఇప్పించారు. శ్రీనివాస్ భార్య మంజులఆ డబ్బులనుకూతురు ఉషారాణిపేరునడిపాజిట్ చేశారు. అటెండర్ కొలువుతో కూతురుని డిగ్రీ,కుమారుడు ఉదయ్ కిరణ్‌ను ఇంటర్మీడియట్ చదివిస్తూ కుటుంబపోషణ చేస్తోంది. దిక్కుతోచనిస్థితిలోఉన్న ఆకుటుంబానికి రూ.10లక్షల రావడం,ప్రభుత్వఉద్యోగంఇవ్వడంతో కేసీఆర్ ఇలవేల్పుగా మారారు.

# జీవచ్ఛవంలా మారిన ఎదిగొచ్చిన కొడుకు

## ప్రమాదంలో గాయపడి నాలుగేళ్లుగా మంచానికే పరిమితం

## ప్రభుత్వం, దాతల సాయానికి ఎదురుచూపులు



ఆనందపురం :అమృత్ తెలంగాణ: నాలుగేళ్ల క్రితం వరకు అందరిలాగానే ఆడుతూ, పాడుతూ తిరుగుతూ, ఇంటర్ వరకు చదువుకున్న ఆ యువకుడు అనుకోని ప్రమాదంలో నడుము, కాళ్లు చచ్చుబడిపోయి జీవచ్ఛవంలా మారి మంచానికే పరిమితమయ్యాడు. రెక్కాడితేగాని డొక్క నిండని నిరుపేద కుటుంబంలోని ఏకైక కుమారుడు అందొచ్చి, ఆదుకుంటాడని భావిస్తే, ఇలా ఆవిటివాడు కావడంతో ఆ తల్లి వేదన అంతాఇంతా కాదు. ప్రభుత్వం, దాతలెవరైనా ఆదుకుని తనకు ఆసరాగా నిలవాలని బాధిత యువకుడు వేడుకుంటున్నాడు. వివరాలివి. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామానికి చెందిన కుర్ర నాగేశ్వరరావు, నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇంటిపెద్దదిక్కు కష్టంపైనే కుటుంబపోషణ సాగుతున్న పరిస్థితుల్లో పదేళ్ల క్రితం నాగేశ్వరరావు అకాలమరణంలో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. స్థానికంగా కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తున్న నాగలక్ష్మి, తర్వాత మండలంలోని నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలలో కుక్‌గా చేరింది. వచ్చిన కాస్తో, కూస్తో సంపాదనతో అష్ట కష్టాలు పడి కుమార్తెలు శాంతికుమారి, గీతాలక్ష్మిల పెళ్లిచేసింది. కొడుకు మోహన్‌కృష్ణ (23) ఇంటర్మీడియట్ పూర్తి చేసి డిగ్రీ చదవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, 2021 మే నెలలో స్నేహితులతో సరదాగా తాటి చెట్టు ఎక్కి, చెట్టు పైనుంచి కిందన పడడంతో నడుము రెండు కాళ్లు, చచ్చుబడిపోయాయి. అప్పటివరకు కష్టాల్లోనైనా సాఫీగా సాగుతున్న ఆ కుటుంబం ఒక్కసారిగా భారీ కుదుపునకు గురైంది.అందొచ్చిన కొడుకు మంచానపడడంతో అందినచోట అప్పులు చేసి చికిత్స చేసింది. రోజుకు రూ.800 చొప్పున వెచ్చించి ఫిజియోథెరపీ కూడా చేసినా, మోహనకృష్ణ ఆరోగ్యం బాగుపడకపోగా, వీల్‌చైర్‌కు పరిమితమైపోయాడు. ఆటపాటల్లో ఎంతో చలాకీగా ఉండే మోహన్‌కృష్ణ చదువుకునేరోజుల్లో ఉన్న ఆసక్తితో కంప్యూటర్ డిజైనింగ్ నేర్చుకున్నాడు. తాను మంచం పట్టిన తర్వాత ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందలేదని మోహనకృష్ణ వాపోతున్నాడు. అధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాడు. తాను డిజైనింగ్ నేర్చుకున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఏదైనా ప్రైవేటు సంస్థలు తనకు వర్క్ ఫ్రం హోం ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరుతున్నాడు. 9948876619 నంబర్‌కు సంప్రదించి, తనను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

# ఈ.ఎమ్.డి.పి ప్రాజెక్టులో పాలగుమ్మి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక



అమలాపురం రూరల్ (కోనసీమ)అమృత్ తెలంగాణ: : ఈ.ఎమ్.డి.పి వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ ఉన్నత పాఠశాల రామచంద్రపురం లో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఈ.ఎమ్.డి.పి ఎక్స్ పో లో అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి ఎక్స్ పో కు ఎంపి కయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంట్రు వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు వరుసగా 3సార్లు జిల్లా స్థాయికి ఎంపికయ్యి హ్యాట్రిక్ సాధించి వరుసగా 2వసారి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కాలవలో దొరికే గుర్రపు డెక్కలతో వివిధ రకాల కళాకృతులు తయారు చేయడం, వాటితో కంపోస్టు తయారు చేసి సేంద్రియ పద్ధతులతో మంచి ఫలదాయం కాయించడం, పర్యావరణం కలుషితం కాకుండా కాపాడడం వంటి ప్రాజెక్ట్ ను వీరు తయారు చేశారు.రాష్ట్ర స్థాయికి ఎంపికైన సందర్భంగా గైడ్ టీచర్ ఏ.బి చంద్రావతి, ఎస్. ఏ (బి.ఎస్ ), విద్యార్థులు ఏ.ఎస్.ఎల్. వి. నాగేశ్వరరావు (9వ తరగతి), సిహెచ్. వెంకట రామ తేజ(9వ తరగతి)లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే గ్రామ సర్పంచ్‌కుడిపూడి రామలక్ష్మి,ఎంపీటీసీ పాలగుమ్మి విజయ, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ కాట్రు మురలీకృష్ణమోహన్, కమిటీ సభ్యులు తదితరులు వీరిని అభినందించారు.

# ఎలక్ట్రానిక్ వేస్ట్ తో పర్యావరణానికి ముప్పు

ఆలమూరు (కోనసీమ) :అమృత్ తెలంగాణ: మన నివాస పరిసరాలలో మనం వినియోగించిన తర్వాత పనికిరాని వ్యర్ధాలుగా మారిన ఎలక్ట్రానిక్ వేస్ట్ పరికరాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని వాటిని వేస్ట్ యార్డ్ కు తరలించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఇంచార్జ్ డిఎల్పిఓ, ఎంపీడీవో ఏ.రాజు, తాహాసిల్దార్ కె.జె.ప్రకాష్ బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వారి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద "సాసా" కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు తమ సిబ్బందితో కలిసి హాజరై స్వచ్ఛ ఆంధ్ర స్ఫూర్తితో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ కార్యాలయాల్లో కంప్యూటర్లు వాడకంలో పాడై వ్యర్థాలుగా మిగిలిన ఎలక్ట్రానిక్ పరికరాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కియోస్కోలలో అందించాలన్నారు. నిరుపయోగంగా ఉండే ఎలెక్ట్రానిక్ ఉపకరణాలు రేడియేషన్ వెదజల్లడం వలన పర్యావరణానికి ఎంతో కీడు కలుగ చేస్తాయన్న సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరికీ స్వచ్ఛందంగా కలగాలని, అదే రాష్ట్ర ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టార్ సరోజినీ కుమారి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పి.పద్మ, గఅహ నిర్మాణ శాఖ ఏఈ డి.శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, సబ్ రిజిస్టర్ సీనియర్ అసిస్టెంట్ విశ్వ ప్రసాద్, ఏపిఎం ధనరాజు, ఏపీవో అరుణకుమారి, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# అందమైన గులాబీలా మృణాల్ మెరుపులు




గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. గులాబీల మధ్య నవ్వుతూ.. మృణాల్ ఠాకూర్ తన లేటెస్ట్ ఫోటోషూట్‌లో వసంతాన్ని స్వాగతించేసింది. కోస్మోపాలిటన్ మ్యాగజైన్ కోసం ఆమె చేసిన ఈ ఫోటోషూట్ ఎంతో బ్యూటీఫుల్ గా ఉంది. పూలతో ముడిపడిన రంగుల దుస్తులు మరింత అందంగా హైలెట్ అయ్యాయి. పింక్, గ్రీన్, క్రీమ్ రంగుల్లో ఉండే డ్రెస్సులతో ఆమె వేసిన పోజులు మనసును తాకేలా ఉన్నాయి. ఈ ఫోటోలు ఆమెలోని ఫెమినిన్ గ్లామర్‌తో పాటు ఇంటెన్సిటీని కూడా చూపిస్తున్నాయి. తెలుగు ప్రేక్షకులకు 'సీతారామం' చిత్రంతో చాలా దగ్గరైన మృణాల్.. ఆ తర్వాత 'హాయ్ నన్న' లాంటి సినిమా ద్వారా మంచి గుర్తింపు పొందింది. తక్కువ సమయంలోనే దక్షిణాది పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుంది. నటనలో ఆమె చూపించిన హావభావాలను ఇప్పటికే అన్ని వర్గాల ఆడియెన్స్ మెచ్చుకుంటారు. అదే అనుభూతిని ఈ ఫోటోల్లో కూడా పలికిస్తోంది. ఇక ఈ ఫోటోషూట్‌కు 'బ్లూమింగ్ ఇన్‌టు ఏ న్యూ సీజన్' అనే క్యాప్షన్ పెట్టిన మృణాల్.. వసంతాన్ని, కొత్త ప్రారంభం అంటూ అందమైన వివరణ ఇచ్చింది. ఫొటోషూట్ కోసం ఆమె ఫ్లవర్ ఆర్ట్‌ని పటిష్టంగా ఉపయోగించిన విధానం, బ్యాక్‌డ్రాప్ డిజైన్ వరకు అన్నీ ప్రత్యేకంగా నిలిచాయి. మొత్తానికి మృణాల్ ఠాకూర్ తన ఫోటోషూట్‌తో మరోసారి ఎంతగానో ఎట్రాక్ట్ చేసింది. ఇక ఆమె సినిమాల విషయానికి వస్తే.. మంచి విజయాలు వచ్చిన తరువాత కూడా అమ్మడు తొందర పడకుండా నెమ్మదిగా కంటెంట్ ఉన్న సినిమాలను సెలెక్ట్ చేసుకుంటోంది. ప్రస్తుతం బాలీవుడ్ లో సన్ ఆఫ్ సర్దార్ 2, పూజా మేరీ జాన్ లాంటి సినిమాల్లో నటిస్తోంది. అలాగే తెలుగులో అడివి శేష్ డెకాయిట్ లో కూడా ఆమె హీరోయిన్ గా నటిస్తోంది.

# బీచ్‌లో అందాల బికినీ శిల్పం



తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. రెండు దశాబ్దాల క్రితం తమిళ్ మూవీ 'మద్రాసి' సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ వేదిక. ఇండస్ట్రీలో అడుగు పెట్టి సుదీర్ఘ కాలం అయినా, నాలుగు పదుల వయసుకు చేరువ అయినా కూడా వేదిక అందం ఏమాత్రం తగ్గలేదు. ఈమధ్య కాలంలో వేదిక సోషల్ మీడియాలో షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. కెరీర్ మొదటి నుంచి అందంగా, గ్లామర్ గా కనిపిస్తూ వస్తున్న వేదిక ఇప్పుడు కూడా ఏమాత్రం తగ్గకుండా అందంగా కనిపిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్స్‌ను కవ్విస్తోంది. తాజాగా మరోసారి అంతా షాక్ అయ్యే విధంగా బికినీ ఫోటోలను షేర్ చేయడం ద్వారా వేదిక వార్తల్లో నిలిచింది. ప్రీ రిలీజ్ ఈవెంట్ బిగ్ ట్విస్ట్! తెలుగులో 2007లో నందమూరి కళ్యాణ్ రామ్‌తో కలిసి 'విజయదశమి' సినిమాతో అడుగు పెట్టిన వేదిక ఆ తర్వాత చాలా తెలుగు సినిమాల్లో నటించింది. కానీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. తెలుగులో ఈమె బాలకృష్ణకు జోడీగా రూలర్ సినిమాలో నటించి మెప్పించింది. ఆ తర్వాత బంగార్రాజు సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. తెలుగులో ఈమె గత ఏడాది రజాకార్, ఫియర్ సినిమాల్లో నటించి మెప్పించింది. గత ఏడాదిలోనే ఒక తమిళ్ సినిమాను కూడా చేయడం ద్వారా గత ఏడాది బిజీ బిజీగా ఉంది. ఈ ఏడాది రెండు లేదా మూడు సినిమాలతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే గన అనే కన్నడ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదే ఏడాదిలో మరో రెండు సినిమాలతో వేదిక ప్రేక్షకుల ముందుకు వస్తుందని తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 4.2 మిలియన్ ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న వేదిక రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇప్పటికే చాలా సార్లు బికినీ ఫోటోలను షేర్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు మరోసారి టూ పీస్ బికినీతో బీచ్‌లో ఫోటోలకు ఫోజ్ ఇచ్చి అందాల శిల్పమా అంటూ అంతా ఆశ్చర్య పోయే విధంగా ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం వల్లే వేదిక కి ఇంకా వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. అయితే స్టార్ హీరోల సినిమాలో నటించకున్నా ఈ స్థాయిలో పాపులారిటీ దక్కించుకుని, ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవడం ఈమెకు మాత్రమే చెల్లిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో మోడలింగ్ చేసిన ఈమె ప్రముఖ కంపెనీకి చెందిన యాడ్స్‌లో నటించడం ద్వారా గుర్తింపు దక్కించుకుని సినిమాల్లో ఆఫర్లు సొంతం చేసుకుంది. పలు అవార్డులను రివార్డులను, రికార్డ్‌లను సొంతం చేసుకున్న వేదిక ముందు ముందు అయినా తన అందంకు తగ్గ స్థాయిలో ఆఫర్లను సొంతం చేసుకుంటుందేమో చూడాలి

# చక్కనమ్మల స్నేహం అలా కుదిరింది!

బాలీవుడ్ యువనాయికలు సారా అలీఖాన్– జాన్వీ కపూర్ ల మధ్య స్నేహం అభిమానులకు కొత్తేమీ కాదు. ఈ జోడీ తరచుగా వెకేషన్ స్పాట్స్ నుంచి ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటారు. ఇటీవలే ఆ ఇద్దరూ కలిసి కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించినప్పటి ఫోటోలు వైరల్ అయ్యాయి. సారా అలీ ఖాన్ – జాన్వీ కేదార్ నాథ్ ఆలయాన్ని సందర్శించిన ఫోటోలను అభిమాన సంఘాలు పోస్ట్ చేయగా వాటిలో ఇద్దరూ శివుడిని ప్రార్థిస్తూ కనిపించారు. అంతకుముందు కూడా వీరిద్దరూ రణవీర్ సింగ్ 'ది బిగ్ పిక్చర్' అనే టీవీ షోలో కనిపించారు. తమ మధ్య స్నేహం గురించి మాట్లాడారు. ఎపిసోడ్ సమయంలో రణవీర్– జాన్వీ –సారాలను వారి స్నేహం (స్నేహితులు) గురించి ఎక్కువగా అడిగాడు. నిజానికి ఆ ఇద్దరికీ కామన్ ఫ్రెండ్స్ ఉన్నారు. కాలక్రమంలో స్నేహం కుదిరింది. జాన్వీ అందించిన వివరాల ప్రకారం.. ఆ ఇద్దరికీ చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. నేను సారాను ఒక అవార్డు ఫంక్షన్ లో మొదటిసారి కలిశాను.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఎర్ర చీర కట్టులో సంయుక్త



రెగ్యులర్‌గా సోషల్ మీడియా ద్వారా ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంయుక్త మీనన్ తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. మలయాళ సినిమా పాప్‌కార్న్‌తో దాదాపు దశాబ్ద కాలం క్రితం సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. వరుసగా మలయాళ సినిమాలు చేస్తూ వచ్చిన ఈమెకు 2018లో కలరి అనే తమిళ సినిమాలో నటించే అవకాశం దక్కింది. అత్యధిక మలయాళ సినిమాల్లో నటించిన సంయుక్త మీనన్ ఆ తర్వాత తమిళ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించింది. ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు కూడా పలు సినిమాలతో సుపరిచితురాలు అయింది. తెలుగులో ఈమె భీమ్లా నాయక్ సినిమాలో ముఖ్య పాత్రలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడికి విరూపాక్ష సినిమాతో భారీ విజయం దక్కింది. తెలుగులో వరుసగా సార్, విరూపాక్ష, బింబిసార సినిమాలతో సక్సెస్‌లు దక్కాయి. దాంతో ఈ అమ్మడు ఎక్కువ ఆఫర్లు దక్కించుకుంది. ప్రస్తుతం తెలుగులో ఈమె మూడు సినిమాల్లో నటిస్తోంది. మూడు సినిమాలు సైతం ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. భారీ అంచనాల నడుమ రూపొందుతున్న అఖండ 2 సినిమాలోనూ ఈమె కీలక పాత్రలో కనిపించబోతుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై అధికారికంగా క్లారిటీ రాలేదు. నారి నారి నడుమ మురారి సినిమాలోనూ ఈమె నటిస్తున్న విషయం తెల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com